

మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థిగా వంశీచంద్‌రెడ్డిని ప్రకటిస్తున్న సీఎం రేవంత్



స్టాళ్ల నిర్వాహకులతో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి



అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న సీఎం; చిత్రంలో మంత్రులు

కొడంగల్ రూపురేఖలు మార్చాలి

కోస్గి రూరల్: కొడంగల్ నియోజకవర్గం రూపురేఖలను మార్చాలని, అందుకు అధికారులు సహకరించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. నియోజకవర్గంలోని కోస్గిలో బుధవారం పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. కొడంగల్ - నారాయణపేట లిఫ్ట్ ఇరిగేషన్‌తో పాటు బీటీ రోడ్లు, మెడికల్ కళాశాల, నర్సింగ్ కళాశాల, మహిళా డిగ్రీ కళాశాల, వెటర్నరీ కళాశాల, తదితర పనులకు సంబంధించిన 12 శిలాఫలకాలను మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిలతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం మహిళా సంఘాల సభ్యులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. నారాయణపేట, వికారాబాద్ జిల్లాలకు రూ.107.53 కోట్ల నిధులు మంజూరు చేసి, చెక్కును అందించారు. దుద్యాల మండలం పోలేపల్లి గ్రామానికి అడిగిన వెంటనే మహిళాసంఘం భవనాన్ని మంజూరు చేశారు. తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌గారి అమ్మమ్మ గారి ఊరు పోలేపల్లి అని ముఖ్యమంత్రి తెలిపారు. సంఘాలను బలోపేతం చేసుకోవాలని మహిళా సంఘాల సభ్యులకు సూచించారు. మహిళా సంఘాల వ్యవస్థ మొదటగా పాలమూరులోనే ప్రారంభమైందని, 1995లో దౌల్తాబాద్‌లో గులాబీ మహిళాసంఘం ఏర్పడిందని తెలిపారు. హైదరాబాద్‌కు అమెరికా అధ్యక్షుడు జార్జ్‌బుష్ వచ్చినప్పుడు, ఆయనకు మహిళా సంఘాల గురించి వివరించింది గులాబీ సంఘం వారేనని గుర్తు చేశారు. అందుకు ముఖ్యమంత్రి సంతోషం వ్యక్తం చేశారు.

గుండెల్లో పెట్టుకొని.. చూసుకుంటా

- కొడంగల్ ప్రజలు భుజాలపై మోసి సీఎంను చేసి.. గుర్తింపు తెచ్చారు
- పాలమూరు ప్రజలను మోసం చేసినందుకు కేసీఆర్ క్షమాపణ చెప్పాలి
- ఉమ్మడి రాష్ట్రంలో కంటే బీఆర్ఎస్ పాలనలోనే పాలమూరుకు అన్యాయం
- పీఆర్ఎల్ఐ జాతీయ హోదాకు మోదీ ఇచ్చిన హామీపై సమాధానం చెప్పాలి
- చల్లా వంశీచంద్‌రెడ్డిని 50 వేల మెజారిటీతో గెలిపిస్తే మరింత అభివృద్ధి
- కోస్గి కాంగ్రెస్ బహిరంగ సభలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి



కోస్గి సభలో అభివాదం చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): 'నల్లమల ప్రాంతంలోని కుగ్రామం నుంచి వచ్చిన నన్ను ఆశీర్వదించి.. కొడంగల్ ప్రజలు తమ భుజాలపై మోసి.. సీఎంను చేయడంతోపాటు ఢిల్లీ స్థాయిలో గుర్తింపు తెచ్చారు. ఈ నియోజకవర్గ ప్రజలను గుండెల్లో పెట్టుకుని చూసుకుంటా. పాలమూరు గడ్డ అక్కున చేర్చుకుని ఆశీర్వదిస్తే ఈ స్థాయిలో ఉన్నాన'ని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ప్రకటించారు. కొడంగల్ నియోజకవర్గానికి సంబంధించి రూ.4,369 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు బుధవారం కోస్గి పట్టణంలో శంకుస్థాపన చేశారు. అనంతరం మహిళా సమాఖ్య సమీపంలోని మైదానంలో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ బహిరంగ సభలో పాల్గొని మాట్లాడారు. పార్లమెంట్‌లో నోరు లేకున్నా.. పాలమూరులో ఊరు లేకున్నా.. కరీంనగర్‌లో ఓటమి భయంతో పారిపోయి పాలమూరుకు వస్తే.. కేసీఆర్‌ను ఈ ప్రాంత ప్రజలు ఆశీర్వదించారని, కానీ పదేళ్ల తన పాలనలో పాలమూరుకు ఉమ్మడి రాష్ట్రంలో కంటే ఎక్కువ అన్యాయం చేశారని విమర్శించారు. పాలమూరు-రంగారెడ్డి ద్వారా ఒక్క ఎకరాకు కూడా సాగునీరు ఇవ్వలేదని, తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో సాధించుకున్న నారాయణపేట- కొడంగల్ ఎత్తిపోతల పథకాన్ని పక్కన పెట్టారని విమర్శించారు. పాలమూరుకు అత్యంత నష్టం చేసే విధంగా ఏపీ సీఎం జగన్ రోజుకు 12 టీఎంసీలు తరలించుకునే విధంగా పోతిరెడ్డిపాడు సామర్థ్యం పెంపు, రాయలసీమ ఎత్తిపోతల పథకం పనులకు అవకాశం కల్పించారని, ప్రగతి భవన్‌కు పిలిచి భోజనాలు పెట్టి పంపించారని అన్నారు. రోజా ఇంట్లో పులుసు తిని బలిసిపోయి.. 203 జీవో ద్వారా కృష్ణా నీళ్లను ఏపీకి అప్పగించారని ఆరోపించారు. అభివృద్ధి ముసుగులో పాలమూరును దోచుకుని.. ఓట్ల కోసం మళ్లీ ప్రజా పోరుబాట పేరుతో పాదయాత్ర చేయడానికి వస్తున్నారన్నారు. అంతకంటే ముందు కేసీఆర్ పాలమూరు ప్రజలకు క్షమాపణ చెప్పాలని అన్నారు. ప్రజలు చీత్కరించిన తర్వాత కూడా ఏ మొఖం పెట్టుకుని యాత్రలు చేస్తారని విమర్శించారు. పాలమూరుకు జాతీయ హోదా ఇస్తానని 2014లో మోదీ హామీ ఇచ్చారని, నేటికీ హోదా ఇవ్వకపోడానికి ఈ ప్రాంత నాయకులైన డీకే అరుణ, జితేందర్‌రెడ్డి సమాధానం చెప్పాలని అన్నారు. కిషన్‌రెడ్డి అయిదేళ్లుగా కేంద్రమంత్రిగా ఉండి.. వికారాబాద్- కృష్ణా రైల్వేలైన్‌కు తట్టెడు మట్టి తీయించలేదని ఎద్దేవా చేశారు. సిమెంట్ పరిశ్రమలు, రైల్వేలైన్, కృష్ణానది జలాలు రావాలంటే మహబూబ్‌నగర్ పార్లమెంట్ నుంచి ఎంపీగా చల్లా వంశీచంద్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కొడంగల్‌లో 50 వేల మెజారిటీ ఇచ్చిన తర్వాత ఇప్పుడు ఇచ్చిన నిధులతో పాటు మరో రూ. ఐదు వేల కోట్లు నిధులతో మరింత అభివృద్ధి చేస్తానని ప్రకటించారు.



సభకు హాజరైన జనం

ఈ సందర్భంగా వంశీచంద్‌రెడ్డిని పార్లమెంట్ అభ్యర్థిగా ప్రకటించారు.

ఈ ప్రాంతాన్ని పట్టించుకోలే: కోమటిరెడ్డి

కొడంగల్ ప్రాంతం సీఎం రేవంత్‌రెడ్డి వల్ల అందరికీ సుపరిచితమైందని రాష్ట్ర రహదారులు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. ఈ ప్రాంతం కరువు, వలసలతో అల్లాడితే పదేళ్లు పాలించిన బీఆర్ఎస్ రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కారణంగా పట్టించుకోలేదన్నారు. కేవలం గజ్వేల్, సిద్దిపేట, సిరిసిల్లలను మాత్రమే అభివృద్ధి చేసుకున్నారని తెలిపారు. కమీషన్ల కక్కుర్తి వల్ల పాలమూరు, నల్గొండ జిల్లాలకు అన్యాయం చేసిన కేసీఆర్ రేవంత్‌రెడ్డి ఎడమకాలి గోటికి సరిపోరని విమర్శించారు. ప్రాజెక్టుల పూర్తి కోసం రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని అన్నారు.



వేదికపై మంత్రులు, ఎమ్మెల్యేలు

నారాయణపేటకు జీవధార: ఉత్తమ్

తన అనుభవంలో ఒకేరోజు నియోజకవర్గానికి రూ.4,369 కోట్లతో నిధులతో పనులను ప్రారంభించుకోవడం ఇదే మొదటిసారని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి తెలిపారు. దేశంలో కొడంగల్ నియోజకవర్గం ఆదర్శంగా నిలుస్తుందని అన్నారు. కొడంగల్‌ను గత పాలకులు నిర్లక్ష్యం చేశారని, భౌగోళిక పరిస్థితుల నేపథ్యంలో ఎత్తిపోతల పథకం నిర్మించాలని తలపెట్టినా పట్టించుకోలేదని అన్నారు. నారాయణపేట- కొడంగల్ ఎత్తిపోతల పథకం తీవ్ర దుర్భిక్షమైన ఈ జిల్లాకు జీవధారగా నిలుస్తుందని అన్నారు. భూత్పూరు రిజర్వాయర్ నుంచి నాలుగు దశల్లో 7.10 టీఎంసీల మిగులు జలాలతో రూ. 2945.50 కోట్ల అంచనా వ్యయంతో ప్రాజెక్టు చేపట్టామని తెలిపారు. ముందు ప్రతిపాదించిన లక్ష ఎకరాల ఆయకట్టుకు అదనంగా మరో 30వేల ఎకరాలు చేర్చి.. 1.30లక్షల ఎకరాల ఆయకట్టును నిర్దేశించామని అన్నారు. మొత్తం నాలుగు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లు నిర్మిస్తామని అన్నారు. భూత్పూరు నుంచి ఊట్కూరు రిజర్వాయర్‌కు, అక్కడి నుంచి జాజాపూర్‌కు, అక్కడి నుంచి జయమ్మ చెరువుకు, అక్కడి నుంచి కానుకుర్తి రిజర్వాయర్‌కు నీరును లిఫ్ట్ చేస్తామని అన్నారు. ఈ ప్రాజెక్టును రెండేళ్లలో పూర్తిచేస్తామని హామీ ఇచ్చారు.

పాలమూరును కృష్ణా డెల్టా చేస్తాం: జూపల్లి కృష్ణారావు

అంచెలంచెలుగా ఎదిగి.. రాష్ట్ర ముఖ్యమంత్రి అయిన తర్వాత రేవంత్‌రెడ్డి కొడంగల్‌కు సాగునీటి ప్రాజెక్టులతో పాటు.. విద్యా, వైద్య, రోడ్ల సదుపాయాలను కల్పించేందుకు భారీ నిధులతో శంకుస్థాపనలు చేయడం గర్వంగా ఉందని రాష్ట్ర ఎక్సైజ్, టూరిజం శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. పాలమూరును మరో కృష్ణా డెల్టాలాగా మారుస్తామని అన్నారు.

మరో జలయజ్ఞం: వంశీచంద్‌రెడ్డి

పాలమూరులో ప్రస్తుతం నీరందిస్తున్న ప్రాజెక్టులన్నీ.. కాంగ్రెస్ జలయజ్ఞంలో చేపట్టినవేనని, ప్రస్తుతం సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో నారాయణపేట- కొడంగల్ ఎత్తిపోతల పథకానికి శంకుస్థాపనతో రాష్ట్రంలో మరో జలయజ్ఞం ప్రారంభమమైందని సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు చల్లా వంశీచంద్‌రెడ్డి తెలిపారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించి సీఎం రేవంత్‌రెడ్డి బలాన్ని ఇంకా పెంచాలని కోరారు. ఈ సభలో ఎమ్మెల్సీలు కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి, పట్నం మహేందర్‌రెడ్డి జడ్పీ చైర్పర్సన్లు సునీత, సరిత తిరుపతయ్య, ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, కసిరెడ్డి నారాయణరెడ్డి, తూడి మేఘారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, పర్ణికారెడ్డి, వాకిటి శ్రీహరి, వీర్లపల్లి శంకర్, రాజేష్‌రెడ్డి, చిక్కుడు వంశీకృష్ణ, మందుల సామెల్, మాజీ మంత్రి చిన్నారెడ్డి, మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అధికారులు, చెంచు సంఘం నాయకులతో సమావేశమైన పీవో

ఐటీడీఏలో గ్రీవెన్స్‌డే

- అధికారులతో ఐటీడీఏ పీవో రోహిత్ గోపిడి సమీక్ష సమావేశం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మన్ననూర్, ఫిబ్రవరి 21: చెంచుల సమస్యలకు పరిష్కారం చూపేందుకు ఇక నుంచి ప్రతీ బుధవారం మన్ననూరు ఐటీడీఏ కార్యాలయంలో ప్రజా దర్బార్(గ్రీవెన్స్ డే) నిర్వహించనున్నట్లు ఐటీడీఏ పీవో రోహిత్ గోపిడి తెలిపారు. 'మన్ననూరు ఐటీడీఏకు మహర్దశ లభించేనా' అనే శీర్షికన ఈ నెల 20న 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి పీవో స్పందించారు. ఈ మేరకు బుధవారం మన్ననూరులోని ఐటీడీఏ కార్యాలయంలో అధికారులు, ఆదివాసీ, చెంచు నాయకులతో వేర్వేరుగా సమీక్షా సమావేశాలను నిర్వహించారు. చెంచు గ్రామాల్లో కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జన్‌మన్ పథకం పక్కాగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. చెంచు పెంటల్లో ఆధార్‌కార్డులు అందరికీ అందేలా చూడాలని చెప్పారు. వేసవిలో తాగునీటి సరఫరాకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. త్వరలోనే అన్ని గ్రామాల వీటీడీఏలతో చర్చించి, అభివృద్ధి కోసం ముందుకు సాగుతామన్నారు. ఆదివాసీల అతిపెద్ద జాతర అయిన సమ్మక్క సారలమ్మ జాతరకు నల్లమల ఆదివాసీల తరఫున మన్ననూరు ఐటీడీఏ నుంచి పసుపు, కుంకుమ, చీర, సారెలను చెంచు పెద్దలు, ఆడపడుచుల ద్వారా పంపేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. నల్లమలలోని భౌరాపూర్‌లో మహాశివరాత్రి రోజు జరిగే చెంచుల జాతర, సలేశ్వరంలో జరిగే లింగమయ్య ఉత్సవాలను ఐటీడీఏ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తామన్నారు. సమావేశంలో డీటీడీవో కమలాకర్ రెడ్డి, ఐటీడీఏ ఏవో జాఫర్ హుసేన్, డిప్యూటీ ఈవో శంకర్ నాయక్, ఐకేపీ ఏపీడీ లక్ష్మయ్య మన్ననూరు ఎంపీటీసీ దాసరి శ్రీనివాసులు, చెంచు సంఘాల నాయకులు రాజేంద్ర ప్రసాద్, చిర్ర రాములు, పెద్దిరాజు, గురువయ్య, లింగయ్య పాల్గొన్నారు.



ఇంటి పైకప్పు తొలగించి మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

షార్ట్ సర్క్యూట్‌తో.. వస్త్ర దుకాణం దగ్ధం

- వస్త్రాలు, ఇంటి నిర్మాణం కలిపి రూ.80 లక్షల ఆస్తినష్టం

గద్వాల న్యూటౌన్, ఫిబ్రవరి 21: జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని చిన్నఅగ్రహారం కాలనీలోని ఓ ఇంట్లో నిర్వహిస్తున్న వస్త్ర దుకాణంలో బుధవారం ఉదయం షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో రూ.80 లక్షల ఆస్తినష్టం సంభవించింది. బాధితులు, ఫైర్ సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. చిన్న అగ్రహారం కాలనీలో ప్రవీణ్ ఇంట్లో చంద్రబాబు అనే వ్యక్తి కొంత కాలంగా వస్త్ర దుకాణాన్ని నిర్వహిస్తున్నారు. బుధవారం ఉదయం షార్ట్ సర్క్యూట్‌తో దుకాణంలో మంటలు వచ్చాయి. ఫైర్ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వచ్చారు. ఇంటి గదులు చిన్నవిగా ఉండటం, వాట్లతో కూడిన పైకప్పు ఉండటంతో ఫైర్ సిబ్బందికి లోపలికి వెళ్లేందుకు వీలు కాలేదు. పైకప్పు కూలిపోయే స్థితికి రావడంతో పైకప్పు తొలగించి మంటలను ఆర్పేందుకు ప్రయత్నించారు. కానీ అప్పటికే వస్త్రాలు పూర్తిగా దగ్ధమయ్యాయి. ఇల్లు కూడా పూర్తిగా దెబ్బతింది. వస్త్ర దుకాణం, ఇంటి నిర్మాణం మొత్తం కలిసి రూ.80 లక్షల దాకా ఆస్తినష్టం సంభవించినట్లు ప్రవీణ్, ఫైర్ సిబ్బంది గౌస్‌పాష చెప్పారు.

తమకు సమాచారం వచ్చిన వెంటనే అక్కడికి వెళ్లడం వల్ల పక్కన ఉన్న ఇళ్లకు ఎలాంటి ప్రమాదం లేకుండా చర్యలు తీసుకున్నామని గౌస్‌పాష చెప్పారు. ఫైర్ సిబ్బంది రాందాస్, లక్ష్మన్ననాయుడు, గౌస్ పాష, ఖాజాపాషా మంటలను ఆర్పారు.

సంఘటనా స్థలం పరిశీలన

వస్త్ర దుకాణం దగ్ధమైన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ సరిత వెళ్లి పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యుత్‌శాఖ అధికారులతో మాట్లాడి బాధితుడికి నష్టపరిహారం అందేలా చూస్తానని భరోసా ఇచ్చారు.

అనుమానాస్పదంగా కన్పించిన మహిళ

- ఆమె దగ్గరున్న సంచిలో రెండు కత్తులు, గ్లౌజ్‌లు



బ్యాగ్‌లో లభించి కత్తులు

గద్వాల, ఫిబ్రవరి 21 : మండల పరిధిలోని నదీ అగ్రహారంలో బుధవారం రాత్రి ఓ మహిళ అనుమానాస్పదంగా తిరుగుతుండటం గమనించి గ్రామస్థులు అనుమానించారు. ఆమెను ప్రశ్నించగా సమాధానం ఇవ్వకపోగా పరుగులు తీసింది. దీంతో కొందరు యువకులు వెంబడించి ఊరిబయట ఆమెను పట్టుకొని ప్రశ్నించగా, తనది బిహార్ రాష్ట్రం అని హిందీలో చెప్పింది. ఎందుకు వచ్చావని అడగ్గా ఆమె సమాధానం చెప్పలేదు. ఆమె వద్దనున్న సంచిని తనిఖీ చేయగా, రెండు కత్తులు, గ్లౌజ్‌లు ఉండటంతో ఆమె చేతులను కట్టేసి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారొచ్చి ఆమెను స్టేషన్‌కు తరలించారు. ఆమె వెంట ఉన్న మరొకరు తప్పించుకు పోయాడని గ్రామస్థులు తెలిపారు. ఈ విషయంపై ఎస్ఐ శ్రీనివాస్‌ను అడుగగా, ఆమెకు మతిస్థిమితం లేదని తెలిపారు. ఆత్మరక్షణ కోసం కత్తులు ఉంచుకున్నట్లు చెప్తోందన్నారు.

బీఆర్ఎస్‌కు ఓటు వేస్తే మూసీలో వేసినట్టే

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి



మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

ధన్వాడ/మరికల్, ఫిబ్రవరి 21 : పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేస్తే మూసీలో వేసినట్టేనని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి అన్నారు. బీజేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విజయ సంకల్ప యాత్రలో భాగంగా బుధవారం ధన్వాడలో నిర్వహించిన యాత్రలో కిషన్‌రెడ్డితో పాటుగా మాజీ మంత్రి డీకే అరుణ, మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి, శాంతకుమార్ మాట్లాడారు. సాధ్యం కాని హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్టీ ఇప్పటి వరకు ఎన్ని హామీలు నెరవేర్చిందో మీరే చెప్పాలని కోరారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీల్లో ప్రధానంగా ఇప్పటికీ ఉచిత బస్సు తప్ప ఏమి నెరవేర్చలేదన్నారు. రూ.500 గ్యాస్ సిలిండర్ ఎక్కడుందని, రైతుబంధు ఇప్పటికీ మూడెకరాలు దాటలేదన్నారు. ఎన్నికల ముందు రూ.రెండు లక్షల రుణమాఫీ ఎక్కడైందని కిషన్‌రెడ్డి ప్రశ్నించారు. అంతకుముందు బీజేపీ నాయకులు విజయ సంకల్ప యాత్రకు ఘన స్వాగతం పలికారు. అదే విధంగా బీజేపీ విజయ సంకల్ప యాత్ర మరికల్‌కు చేరుకోగా, అక్కడ నిర్వహించిన సమావేశంలో బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ మాట్లాడారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండు పార్టీలు ఒక్కటే అన్నారు. రెండు పార్టీలు ప్రజలకు మోసపూరిత హామీలు ఇచ్చారన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఒక్క భారత దేశానికే కాదు ప్రపంచానికే ఆదర్శ నాయకుడు అన్నారు. తెలంగాణలో ఇప్పుడున్న పరిస్థితిల్లో ప్రజలు మోదీ పాలనను కోరుకుంటున్నారన్నా రు. మోదీ హయాంలోనే పదేళ్ల పాటు దేశంలో సుభిక్ష పాలన సాగిందన్నారు. ప్రజలకు కనీస సౌకర్యాలు, విద్యుత్, రోడ్లు, వంట గ్యాస్, రైతులకు సబ్సిడీ ఎరువులు ఇస్తున్న ఘనత మోదీకే దక్కిందన్నారు. కార్యక్రమంలో చిన్న నర్సన్‌గౌడ్, తిరుపతి రెడ్డి భాస్కర్‌రెడ్డి, వేణు, రమేష్, శ్రీరామ్, నర్సింహులు పాల్గొన్నారు.

మోదీతోనే అవినీతి రహిత పాలన

దేవరకద్ర: : మోదీతోనే దేశంలో అవినీతి రహిత పాలన కొనసాగుతోందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. బీజేపీ ఆధ్వర్యంలో చేపట్టిన విజయ సంకల్ప యాత్ర బుధవారం రెండో రోజు దేవరకద్రకు చేరుకుంది. పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, జాతీయ కోశాధికారి శాంతకుమార్, జాతీయ కార్యవర్గ సభ్యుడు జితేందర్‌రెడ్డిలు యాత్రలో పాల్గొన్నారు. పార్టీ పార్లమెంట్ కన్వీనర్ డోకూర్ పవన్‌కుమార్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి కొండ పశాంత్‌రెడ్డి బైక్ ర్యాలీతో యాత్రకు స్వాగతం పలికారు. కొత్త బస్టాండ్ దగ్గర ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో కిషన్‌రెడ్డి మా ట్లాడారు. గత ప్రభుత్వాలు కుటుంబ పాలనతో బాగుపడ్డాయని, ప్రజలే నరేంద్రమోదీ కుటుంబ మన్నారు. డీకే అరుణ మాట్లాడుతూ మోదీ మరోసారి పీఎం కావడమే లక్ష్యంగా విజయ సంకల్ప యాత్రను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దేవరకద్రలో అండర్ బ్రిడ్జి ఏర్పాటు చేయాలని పట్టణ ఆర్యవైశ్యులు కిషన్‌రెడ్డికి వినతి పత్రాం అందజేశారు. కిషన్‌రెడ్డి మాట్లాడుతూ బీజేపీ ఎంపీ గెలిచిన వెంటనే బ్రిడ్జి పనులు ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎగ్గని నర్సిములు, సుదర్శన్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి నంబిరాజు, మండల నాయకులు పాల్గొన్నారు.



విజయ సంకల్ప యాత్రలో కిషన్‌రెడ్డి, డీకే అరుణ

కాల్వలోకి దూసుకెళ్లిన కారు

- తప్పిన ప్రాణాపాయం



కాల్వలోకి దూసుకెళ్లిన కారు

పాన్‌గల్, ఫిబ్రవరి 21: బైక్‌ను తప్పించబోయి కాల్వలోకి కారు దూసుకెళ్లింది. ఈ ఘటన వనపర్తి జిల్లా పాన్‌గల్ మండల పరిధిలోని అన్నారం తండా సమీపంలో బుధవారం చోటు చేసుకున్నది. ఇందుకు సంబంధించి స్థానికుల వివరాల ప్రకారం.. వనపర్తికి చెందిన ముగ్గురు వ్యక్తులు కొల్లాపూర్‌లో వివాహానికి వెళ్లి తిరిగి వస్తుండగా అన్నారం తండా సమీపంలో ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని తప్పించబోయ్యారు. దాంతో కారు రోడ్డు పక్కన ఉన్న కాల్వలోకి దూసుకెళ్లింది. అయితే ప్రమాదంలో కారులో ఉన్న ముగ్గురు వ్యక్తులకు స్వల్ప గాయాలు అయ్యాయి. ప్రాణాపాయం తప్పింది.

స్వామివారికి హంస వాహన సేవ



హంస వాహన సేవలో లక్ష్మీవేంకటేశ్వరస్వామి

మహబూబ్‌నగర్ రూరల్, ఫిబ్రవరి 21 : తెలంగాణ తిరుపతి మన్యంకొండ శ్రీలక్ష్మీ వేంకటేశ్వర స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ఆలయంలో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి హంస వాహన సేవ నిర్వహించారు. ఆలయ ధర్మకర్త ఆళహరి మధుసూదన్‌కుమార్, అర్చకులు స్వామివారిని పల్లకిలో ఊరేగించి, గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ కార్యనిర్వహణ అధికారి శ్రీనువాసరాజు, అడిషనల్ కార్యనిర్వహణ అధికారి శ్రీనువాస్, ఆలయ వంశపార ధర్మకర్త రామకృష్ణ, సూపరింటెండెంట్ నిత్యానందం, ఫెస్టివల్ ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు పాల్గొన్నారు.

డిగ్రీ ఫలితాలు విడుదల



డిగ్రీ ఫలితాలు విడుదల చేస్తున్న వీసీ, అధికారులు

పాలమూరు యూనివర్సిటీ, ఫిబ్రవరి 21 : యూనివర్సిటీలో యూజీ, పీజీ ఫలితాలు ఇంకా మెరుగుపడాలని పీయూ వీసీ ప్రొఫెసర్ లక్ష్మీకాంత్‌రాథోడ్ సూచించారు. బుధవారం పీయూలోని తన చాంబర్‌లో పరీక్షల నిర్వహణ అధికారి డా.రాజ్‌కుమార్, యూజీ, పీజీ కళాశాలల డైరెక్టర్‌తో కలిసి పాలమూరు యూనివర్సిటీ అనుబంధంగా ఉన్న డిగ్రీ కళాశాల విద్యార్థుల ఫలితాలు విడుదల చేశారు. డిగ్రీ మొదటి సెమిస్టర్, మూడో సెమిస్టర్, ఐదో సెమిస్టర్ ఫలితాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వీసీ ప్రొఫెసర్ ఎల్‌బీ లక్ష్మీకాంత్ రాథోడ్ మాట్లాడుతూ గతేడాదితో పోలిస్తే ఫలితాలు కొంత పెరిగినా ఇంకా పెరగాల్సిన అవసరం ఉందన్నారు. కాగా, మొదటి సెమిస్టర్‌కు 21,743 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా, 6,974 మంది ఉత్తీర్ణత సాధించారు. 7,709 మంది పైతరగతులకు ప్రమోట్ అయ్యారు. మూడో సెమిస్టర్‌లో 17,401 మంది హాజరుకాగా, 7,749 మంది ఉత్తీర్ణత సాధించారు. 5,206 మంది విద్యార్థులు పైతరగతులకు ప్రమోట్ అయ్యారు. ఐదో సెమిస్టర్‌లో 13,211 మంది పరీక్ష రాయగా, 6,758 మంది ఉత్తీర్ణత సాధించారు. 4,986 మంది విద్యార్థులు పైతగరతులకు ప్రమోట్ అయ్యారు. పరీక్ష ఫలితాలను పాలమూరు యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామని, విద్యార్థులు చూసుకోవచ్చని తెలిపారు. మార్కులు తక్కువగా వచ్చినట్లు భావించే విద్యార్థులు, ఫెయిల్ అయిన విద్యార్థులు రీవాల్యుయేషన్ కోసం ఈనెల 29వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు.

కిషన్‌రెడ్డికి స్వాగతం పలికిన పీయూ విద్యార్థులు

పాలమూరు యూనివర్సిటీ, ఫిబ్రవరి 21 : విజయ సంకల్ప యాత్రలో భాగంగా బుధవారం పాలమూరు యూనివర్సిటీకి వచ్చిన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి పీయూ ఏబీవీపీ విద్యార్థులు ఘన స్వాగతం పలికారు. పరిపాలనా భవనం వద్ద పీయూ వీసీ అధికారులతో కలిసి కిషన్‌రెడ్డి రాక కోసం వేచి ఉండగా యూనివర్సిటీ విద్యార్థులు, ఏబీవీపీ విద్యార్థులు పరిపాలన భవనం వైపు మళ్లే సర్కిల్ వద్దనే కిషన్‌రెడ్డికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ అభివృద్ధి, సమస్యలు, విద్యార్థుల సమస్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల నుంచి వినతి పత్రం తీసుకొని పరిపాలన భవనం వద్దకు రాకుండా అక్కడ్నుంచే తిరిగి వెళ్లిపోయారు. గమనించిన వీసీ వెంటనే సర్కిల్ వద్దకు వెళ్లి కిషన్‌రెడ్డి తదుపరి కార్యక్రమం జరిగే ప్రదేశంలో పూలబొకె ఇచ్చి స్వాగతం పలికారు. విద్యార్థులు ముందే ఆపి స్వాగతం పలకడం ద్వారా కోఆర్డినేషన్ సమస్య వల్ల తప్పిదం జరిగిందని కిషన్‌రెడ్డికి వివరించారు. అనంతరం పీయూకి రూ.వంద కోట్లు మంజూరు చేసినందుకు, మంజూరు కావడానికి కృషి చేసిన కిషన్‌రెడ్డికి, డీకే అరుణకు కృతజ్ఞతలు తెలిపారు. మరోమారు పీయూకి వస్తామని వీసీకి కిషన్‌రెడ్డి హామీ ఇచ్చారు.



- లక్షలాదిగా తరలివచ్చిన భక్త జనం
- కిటకిటలాడుతున్న జాతర ప్రాంగణం
- సారలమ్మ రాకతో మొదలైన మహాజాతర
- ప్రశాంతంగా ముగిసిన తొలి ఘట్టం

మేడారం.. జన సంద్రం..

మేడారం బృందం, ఫిబ్రవరి 21: జనం.. జనం ప్రభంజనం. ఎటు చూసినా భక్త జన సంద్రం. అన్ని దారులు మేడారం వైపే.. పలు మార్గాల గుండా లక్షలాది భక్తులు మేడారానికి పోటెత్తుతున్నారు. దీంతో బుధవారం రాత్రి వరకు మేడారం పరిసరాలు జనజాతరయ్యాయి. భక్తుల తాత్కాలిక గుడారాలు, చిరువ్యాపారుల అంగళ్లతో సందడిగా మారింది. జాతరకు ఇప్పటికే కోటిమంది వరకు భక్తులు వచ్చినట్టు ప్రాథమిక అంచనా కాగా గురువారం సాయంత్రానికి మరో 50లక్షల మంది వరకు రావొచ్చనని భావిస్తున్నారు. నెలరోజులుగా మేడారానికి వస్తూ ముందస్తు మొక్కులు చెల్లించుకున్న భక్తులు కాక వీరు అదనమని అధికారులు చెబుతున్నారు. ఇక జాతరలో తొలిఘట్టమైన సారలమ్మ రాక.. బుధవారం సాయంత్రం జరగ్గా.. సాయంత్రానికి ఒక్కసారిగా భక్తుల తాకిడి పెరిగింది. ఈ నేపథ్యంలో పోలీసులు మరింత అప్రమత్తమయ్యారు. మేడారంలోకి ప్రవేశించే అన్ని మార్గాల వద్ద మోహరించి.. వాహనాలను నియంత్రిస్తున్నారు. ఎడ్లబండ్లు, ట్రాక్టర్లు, డీసీఎంలు, లారీలు, కార్లు, ఆటోలు తదితర వాహనాల్లో వస్తుండగా.. డ్యూటీ, ప్రత్యేక పాస్‌లున్న కొన్ని వాహనాలను మాత్రమే మేడారంలోకి అనుమతిస్తున్నారు. దీంతో ప్రైవేటు వాహనాల్లో వచ్చే వారంతా మేడారానికి ఐదు కిలో మీటర్ల దూరంలోని పార్కింగ్ ప్రాంతాల నుంచి మూటాముల్లెలతో కాలినడకన గద్దెలకు చేరుకుంటున్నారు.

దూరప్రాంతాల నుంచి..

తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, ఛత్తీస్‌ఘడ్, ఒడిశా తదితర రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. జాతర సమయంలోనే సమ్మక్క, సారలమ్మలను దర్శించుకోవాలని తపించే లక్షల మంది మంగళవారం నుంచి మేడారం బాట పట్టారు. వాహనాలు, బస్సులు, ఎడ్ల బండ్లలో తరలివచ్చి మేడారం చుట్టుపక్కల విడిది చేశారు. దీంతో మేడారానికి ఎటుచూసినా 20 కి.మీ. వరకు భక్తుల సందోహమే కనిపిస్తోంది. వనం అంతా జనమైంది.




సమ్మక్కగద్దె

వనదేవతల రాకతో..

బుధవారం రాత్రి సారలమ్మ రాకతో వనం పులకించిపోయింది. రాత్రి కన్నెపల్లి నుంచి సారలమ్మను ప్రధాన పూజారి కాక సారయ్య జయజయధ్వానాల మధ్య తీసుకొచ్చారు. అలాగే పూనుగొండ్ల నుంచి మంగళవారం బయలుదేరిన పగిడిద్దరాజు బుధవారం మేడారానికి చేరుకున్నారు. కొండాయి నుంచి గోవింద రాజులు, నాగులమ్మ గద్దెలకు చేరుకోవడంతో భక్తుల మొక్కులు ప్రారంభమయ్యాయి.


కన్నెపల్లి నుంచి సారలమ్మను తీసుకొస్తున్న ప్రధాన పూజారి కాక సారయ్య


జంపన్నవాగు వద్ద యాట మొక్కులు చెల్లిస్తున్న భక్తులు


భక్తులతో కిక్కిరిసిన వనదేవతల గద్దెల ప్రాంగణం


జాతరలో జాతకాలు చెబుతున్న కోయదొర

డిగ్రీ కళాశాలను
సందర్శించిన న్యాక్ బృందం


జడ్చర్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పూర్వ విద్యార్థుల సమావేశంలో మాట్లాడుతున్న న్యాక్ బృందం

జడ్చర్ల, ఫిబ్రవరి 21 : జడ్చర్ల బూర్గుల రామకృష్ణారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలను బుధవారం న్యాక్ బృందం పరిశీలించింది. న్యాక్ బృందం చైర్మన్‌గా కర్ణాటక రాష్ట్రం హసన్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ టీసీ.తారానాథ్, కోఆర్డినేటర్ సభ్యుడిగా తిరుపతి శ్రీవెంకటేశ్వర యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ కె.జయచంద్రారెడ్డి, సభ్యుడిగా అస్సాం రాష్ట్రం జోర్హాట్ జేబీ కళాశాల మాజీ ప్రిన్సిపాల్ డాక్టర్ బిమల్‌బరాహ్‌లు కళాశాలను సందర్శించారు. గత సంవత్సరం మార్చి 15, 16వ తేదీల్లో న్యాక్ బృందం పర్యటించింది. కాగా, కళాశాలలో చేపట్టిన అభివృద్ధికి గుర్తింపుగా కేవలం బి++ గ్రేడ్ రావడంతో, సరైన గ్రేడ్ రాలేదని, పునఃపరిశీలించేందుకు మళ్లీ పర్యటించాలన్న కళాశాల యాజమాన్యం విజ్ఞప్తి మేరకు తాజాగా న్యాక్ బృందం రెండురోజుల పాటు కళాశాలలో పర్యటించనుంది. కళాశాలలో విద్యార్థులకు అందిస్తున్న విద్యాబోధన, సదుపాయాలు, వసతులు, తదితర అంశాలపై క్షుణ్ణంగా పరిశీలించి, కళాశాలకు కేటాయించాల్సిన గ్రేడ్ అంశంపై సిఫారసు చేయనున్నారు. న్యాక్ బృందానికి కళాశాల ప్రిన్సిపాల్ అప్పియచిన్నమ్మ, అధ్యాపకులు, విద్యార్థులు ఘనంగా స్వాగతం పలికారు. విద్యార్థులకు బోధిస్తున్న తీరుపై మొదటగా అధ్యాపకులతో సమావేశమయ్యారు. అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులతో వారు మాట్లాడారు. కళాశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు ప్రస్తుతం అందిస్తున్న సదుపాయాలు, సౌకర్యాలతో పాటు అదనంగా కావాల్సిన వాటిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం కళాశాలలోని బొటానికల్ గార్డెన్‌ను సందర్శించి, హెర్బేరియంను పరిశీలించారు. అనంతరం కళాశాలలోని వివిధ విభాగాధిపతులతో మాట్లాడి, ఆయా విభాగాల ద్వారా నిర్వహిస్తున్న కార్యక్రమాలు, విద్యాబోధనను పరిశీలించారు. అనంతరం అలూమ్ని సమావేశ గదిలో పూర్వ విద్యార్థులతో సమావేశం అయ్యారు. కళాశాలకు కావల్సిన సదుపాయాల కోసం అలూమ్ని ద్వారా ఇప్పటికే రూ.66లక్షలకు పైగా వెచ్చించి అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టామని అలూమ్ని అధ్యక్ష, కార్యదర్శులు పాలాదిరాంమోహన్, బాదిమి రవిశంకర్‌లు వివరించారు. రెండురోజుల పర్యటనలో భాగంగా గురువారం సైతం బృందం కళాశాలలో పర్యటించనుంది. కళాశాలకు కేటాయించే గ్రేడ్‌కు సంబంధించిన పూర్తి నివేదికను యుజిసికి అందించనున్నట్లు న్యాక్ బృందం తెలిపింది. కార్యక్రమంలో ఐక్యూఏసీ కోఆర్డినేటర్, అలూమ్ని కళాశాల కోఆర్డినేటర్ శ్రీనివాసులు, బొటానికల్ గార్డెన్ సమన్వయకర్త, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సదాశివయ్య, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

పద్మశ్రీ అవార్డు గ్రహీతకు సన్మానం

▸▸ రూ.లక్ష ఆర్థిక సాయం



మాట్లాడుతున్న దాసరి కొండప్ప

దామరగిద్ద, ఫిబ్రవరి 21 : కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పద్మశ్రీ అవార్డులో మండల కేంద్రానికి చెందిన దాసరి కొండప్పకు చోటు దక్కడం సంతోషమని హైదరాబాద్‌కు చెందిన భీస్మా ఇన్ఫ్రా డెవలపర్స్ డైరెక్టర్ రాజ్‌కుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రానికి చెందిన పద్మశ్రీ అవార్డు గ్రహీత దాసరి కొండప్ప ఇంటికి వచ్చి పూలమాల, శాలువాతో ఘనంగా సన్మానించి రూ.లక్ష ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా అంతరించి పోతున్న దాసరిల కుల వృత్తినే నమ్ముకుని ఇప్పటికీ బతుకు సాగిస్తున్న దాసరి కొండప్ప కుటుంబాన్ని కేంద్ర ప్రభుత్వం గుర్తించి పద్మశ్రీ అవార్డుకు ఎంపిక చేయడంతో సంతోషం అన్నారు. వెనకబడ్డ ఈ ప్రాంత పేరును ఢిల్లీకి వినిపించిన దాసరి కొండప్పకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో భీమయ్య గౌడ్, బాల్‌రెడ్డి, ఖాజా, శరణ్ నాయక్, శ్రీనివాస్ శెట్టి, గవినోళ్ళ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఆర్ సెంటర్‌లో సౌకర్యాలు కల్పించాలి



ఎమ్మెల్యేకు వినతి పత్రం అందిస్తున్న గార్లపల్లి గ్రామస్థులు

మక్తల్, ఫిబ్రవరి 21 : మక్తల్ మునిసిపాలిటీ పరిధిలోని గార్లపల్లి ఆర్‌ఆర్ సెంటర్‌కు అన్ని సౌకర్యాలు కల్పించాలని కోరుతూ బుధవారం ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి గ్రామస్థులు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గార్లపల్లి గ్రామానికి ఆర్‌ఆర్ సెంటర్ ఏర్పాటు చేసి తొమ్మిదేళ్లు అవుతున్నా.. గత పాలకుల నిర్లక్ష్యం వల్ల అభివృద్ధికి నోచుకోక ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా ఉందన్నారు. రూ.ఆరు లక్షలతో అంగన్‌వాడీ నిర్మాణం చేపట్టినా, అక్కడ అంగన్‌వాడీ నడవక గర్భిణులు పౌష్టికాహారం కోసం మక్తల్ పట్టణానికి వస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే స్పందించి అంగన్‌వాడీలో అన్ని సదుపాయాలు కల్పించాలన్నారు. గ్రామస్థులు రాజాగౌడ్, చంద్రకాంత్, అనిల్, నరేష్ పాల్గొన్నారు.

● మాగనూరు : మండల కేంద్రంలోని మార్గదర్శి విద్యాలయం ప్రధానోపాధ్యాయుడిగా పని చేస్తున్న వరప్రసాద్‌రెడ్డి కుమారుని వివాహం బుధవారం నారాయణపేట అంజనా గార్డెన్‌లో నిర్వహించగా, ఈ వివాహ వేడుకల్లో మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు ఆనంద్‌గౌడ్, శివరాంరెడ్డి, రాఘవరెడ్డి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం



ఉత్తమ ఉపాధ్యాయుడిని సన్మానించిన పీఆర్టీయూ నాయకులు

మాగనూరు, ఫిబ్రవరి 21 : కృష్ణ మండలం కున్సీ ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయుడు సురేందర్‌కు జాతీయ ఉత్తమ అవార్డు రావడంతో బుధవారం మాగనూరు మండల పీఆర్టీయూ ఆధ్వర్యంలో పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పీఆర్టీయూ రాష్ట్ర నాయకుడు తిరుపతి, నరసింహరెడ్డి మాట్లాడుతూ ప్రధానోపాధ్యాయుడు సురేందర్‌కు జాతీయ ఉత్తమ అవార్డు రావడం గర్వకారణం అన్నారు. ప్రతీ ఉపాధ్యాయుడు సురేందర్‌ను ఆదర్శంగా తీసుకొని పని చేయాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటయ్య మండలాధ్యక్షుడు నరేందర్, ప్రధాన కార్యదర్శి తిమ్మన్న, గౌరవాధ్యక్షుడు బలరాం, జిల్లా కార్యదర్శి రమేష్, గాయత్రి, శ్రీనివాసులు, మహిళా ఉపాధ్యక్షురాలు దీప, శ్రీనివాసులు, వెంకటయ్య లక్ష్మారెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, ప్రవీణ్, డేవిడ్ పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహాల ప్రతిష్ఠాపన



హోమంలో పాల్గొన్న దంపతులు

మక్తల్, ఫిబ్రవరి 21 : మక్తల్ పురపాలిక పరిధిలోని దండు గ్రామంలో రెండు రోజుల నుంచి విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తున్నారు. బుధవారం నూతనంగా నిర్మించిన ఆలయంలో పార్వతీ పరమేశ్వరుల విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా పవిత్ర కృష్ణానది నుంచి తెచ్చిన నీటితో విగ్రహాలకు అభిషేకం నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో హోమం, ప్రత్యేక పూజలు నిర్వహించి, అన్నదానం చేశారు. కార్యక్రమంలో అర్చకులు రాఘవేంద్ర చారి, శ్యామ్‌సుందర్ చారి, కార్తీక్, శేషగిరి పాల్గొన్నారు.

సీఎం సభకు తరలివెళ్లిన కాంగ్రెస్ నాయకులు

మాగనూరు, ఫిబ్రవరి 21 : ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి తొలిసారి సొంత నియోజకవర్గంలోని కోస్గి పట్టణంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేయడానికి రావడంతో, ఏర్పాటు చేసిన బహిరంగ సభకు మాగనూరు మండలం నుంచి పెద్ద ఎత్తున కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు తరలివెళ్లారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్, శివరాం రెడ్డి, వాకిటి శ్రీనివాసులు, రాఘవరెడ్డి, డాక్టర్ కృష్ణయ్య, మాజీ ఎంపీటీసీ సభ్యుడు మౌలాలి, వివిధ గ్రామాల కాంగ్రెస్ శ్రేణులు, నాయకులు తరలివెళ్లిన వారిలో ఉన్నారు.

మెగా వైద్య శిబిరం విజయవంతం



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

మరికల్, ఫిబ్రవరి 21 : మండలంలోని జిన్నారం గ్రామంలో కారెడ్డి పద్మమ్మ, కారెడ్డి శేఖర్‌రెడ్డి, కారెడ్డి మహేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎస్‌వీఎస్ మెడికల్ కాలేజీ, హస్పిటర్ వారిచే బుధవారం నిర్వహించిన మెగా వైద్య శిబిరం, రక్తదాన శిబిరం విజయవంతమైంది. పరిసర ప్రాంతాల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనగా, చిన్న పిల్లల వైద్యులు, స్త్రీ వ్యాధి, కంటి వ్యాధి నిపుణులు, జనరల్ మెడిసిన్, రోగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్లు మాట్లాడుతూ దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న పేద ప్రజలకు దవాఖానలో అడ్మిట్ చేసుకుని ఐదు రోజుల వరకు ఉచితంగా పరీక్షలు, చికిత్సలు నిర్వహిస్తామన్నారు. అదే విధంగా కంటి ఆపరేషన్ చేయించుకునే వారు ఆరోగ్యశ్రీ కార్డు, తెల్లరేషన్ కార్డు వెంట తీసుకొని రావాలన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

భక్తుల ఆరాధ్య దైవం

ఎక్లాస్‌పూర్ బాలాజీ

▸▸ రేపటి నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

▸▸ 24న శ్రీనివాస కల్యాణం, మహా రథోత్సవం ▸▸ 25న ఎక్లాస్‌పూర్ తిమ్మప్ప జాతర



వేంకటేశ్వర స్వామి మూల విరాట్

నారాయణపేట, ఫిబ్రవరి 21 : కొలిచిన వారికి కొంగు బంగారంగా విరాజిల్లుతున్న బాలాజీ వెంకటేశ్వర స్వామి (తిమ్మప్ప) బ్రహ్మోత్సవాలు మండలంలోని ఎక్లాస్‌పూర్ గ్రామంలో రేపటి నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు మాణిక్‌శాస్త్రీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాల మధ్య బ్రహ్మోత్సవాలు కొనసాగనుండగా, 23న శుక్రవారం రాత్రి ప్రభోత్సవం, 24న శనివారం ఉదయం 11 గంటలకు శ్రీనివాస కల్యాణం, అర్ధరాత్రి 12.30 గంటలకు మహా రథోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించనున్నారు. 25న ఆదివారం జాతర, వేంకటేశ్వర స్వామి పల్లకీ సేవ, పాల ఉట్లతో పాటు ప్రత్యేక పూజలు జరుగుతాయి. తీరితే తిరుపతి లేకుంటే ఎక్లాస్‌పూర్ గట్టుపై వెలసిన బాలాజీ స్వామిని దర్శించుకోవాలనే నానుడితో ఆర్థికంగా ఉన్న కుటుంబాలు తిరుపతిలోని వేంకటేశ్వర స్వామిని దర్శించుకుంటే ఆర్థికంగా లేని పల్లె వాసులు ఈ ఉత్సవాల్లో పాల్గొని తమ మొక్కులు చెల్లించుకుంటారు. కాగా నారాయణపేట నుంచి ఎక్లాస్‌పూర్‌కు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు సైతం నడుపుతోంది. ప్రత్యేకంగా రూ.50 లక్షల వ్యయంతో బాలాజీ ఎక్లాస్‌పూర్ కొండపై ఆలయం పునర్ నిర్మాణం కొనసాగుతోంది. ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి భక్తుల దాహార్తి తీర్చేందుకు బోరును వేయించారు. ఆలయ నిర్మాణానికి తమవంతు సహకారం అందిస్తానన్నారు. ఆలయ వంశ పారంపర్య అర్చకులు మాణిక్‌శాస్త్రీ, ఈవో శ్యాంసుందర్ ఆధ్వర్యంలో ప్రతీ సంవత్సరం మాదిరిగా ఈ సంవత్సరం కూడా ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

ఆలయ చరిత్ర..

పూర్వ కాలంలో లోకాయపల్లి సంస్థానాన్ని పరిపాలించిన రాణి లక్ష్మమ్మ వేంకటేశ్వర స్వామి భక్తురాలు. ఆమె ప్రతీ ఏటా పల్లకీలో తిరుపతికి వెళ్లి వేంకటేశ్వర స్వామిని దర్శించుకునేవారు. ఒకసారి ఆమె బోయలు మోసిన పల్లకీలో తిరుపతికి వెళ్తూ.. మార్గమధ్యలో విశ్రాంతి తీసుకున్న సమయంలో వేంకటేశ్వర స్వామి స్వప్నంలోకి వచ్చి ఇంత దూరం రానక్కర లేదని, నేనే సంస్థానం పక్కనున్న కొండపై వెలుస్తానని వివరించడంతో ఆమె ఎక్లాస్‌పూర్ కొండపై సుందరమైన ఆలయాన్ని నిర్మించినట్లు పూర్వీకుల కథనం. తమ సంస్థానం పక్కనే గల గట్టుపై వెలసిన వేంకటేశ్వర స్వామిని ఆమె నిత్యం సందర్శించి భక్తిశ్రద్ధలతో పూజిస్తూ వచ్చారు. ఇందులో భాగంగానే భక్తులు ప్రతీ ఏటా జరిగే ఉత్సవాలకు పెద్ద ఎత్తున హాజరై స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తుంటారు.





అభంగాపూర్, మక్తల్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులుగా వ్యవహరించిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం

నారాయణపేట రూరల్, ఫిబ్రవరి 21 : మండలంలోని అభంగాపూర్, బండగొండ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో బుధవారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని విద్యార్థులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయుల వేషధారణలో తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ఆయా కార్యక్రమాల్లో హెచ్‌ఎంలుగా శ్రీవల్లి, అఖిల, కలెక్టర్‌లుగా శ్రావణి, దివ్య, డిప్యూటీ కలెక్టర్‌గా విష్ణు, డీఈవోగా రాధిక, ఎంఈవోలుగా సాయిరాం, అనిత వ్యవహరించారు. కార్యక్రమాల్లో హెచ్‌ఎంలు అంబర్‌నాథ్, శంకర్‌నాయక్, ఉపాధ్యాయులు, సుదర్శన్, సాయికుమార్, రవికుమార్, రవీందర్, పవన్, సౌమ్య, సాయికిరణ్, మాధవి, మౌనిక, చైతన్య, పుష్ప పాల్గొన్నారు.

● మక్తల్ : మక్తల్ పట్టణంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (చాకలి గేరి)లో బుధవారం విద్యార్థులు స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ప్రధానోపాధ్యాయురాలిగా దీక్ష, కలెక్టర్‌గా నరసింహ, డీఈవోగా మహానంద్, ఉపాధ్యాయులుగా ఆకాష్, గోపాల్, పాపులు, మహేష్, రిషిక, రమేష్, రాఘవ, మాధురి, మహేశ్వరీ వ్యవహరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో జీహెచ్‌ఎం అనిల్‌గౌడ్ మాట్లాడుతూ విద్యార్థుల శక్తి సామర్థ్యాలను, ఉపన్యాస నైపుణ్యాలను పెంపొందించేందుకు స్వయం పరిపాలన దినం ఉపకరిస్తుందన్నారు. అనంతరం ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ప్రధానోపాధ్యాయురాలు డీజీ హైమావతి, సునంద, సీఆర్పీ సునీత పాల్గొన్నారు.

అందని ద్రాక్షగా కంప్యూటర్ విద్య

▸▸ శిక్షకులు లేక ఉత్సవ విగ్రహాలుగా మారిన కంప్యూటర్లు

▸▸ ఉపాధ్యాయులకు శిక్షణ బాధ్యతలపై అసంతృప్తి



చిన్నపొర్ల పాఠశాలలో వృథాగా ఉన్న కంప్యూటర్లు

ఊట్కూర్, ఫిబ్రవరి 21 : శాస్త్ర సాంకేతికంగా జరుగుతున్న అభివృద్ధిలో భాగంగా భావితరాలకు అన్ని రకాల పరిజ్ఞానం అందించాలనే లక్ష్యంతో ప్రారంభించిన కంప్యూటర్ విద్య కాస్త మూన్నాళ్ల ముచ్చటగా మిగిలిపోయింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత వాటి ఊసే ఎత్తక పోవడంతో కంప్యూటర్ విద్య కాస్త ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అందని ద్రాక్షలా మారింది. ఫలితంగా లక్షలు వెచ్చించి కొనుగోలు చేసిన కంప్యూటర్లు పనికి రాని వస్తువులుగా మిగిలిపోయాయి. తెలంగాణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్యను అందిస్తామని చెప్పడంతో పాటు మరో పక్క గ్రామ స్థాయి నుంచి ఇంగ్లిష్ మీడియం సైతం పాఠశాలల్లో ప్రారంభించింది. అలాగే కొత్తగా ఆర్ట్, మ్యూజిక్, డ్రాయింగ్ టీచర్ల నియామకం కూడా చేపట్టింది. కానీ గతంలో ఉన్న కంప్యూటర్ విద్యను మాత్రం మరిచిపోయింది. దీంతో పాఠశాలల్లో కంప్యూటర్ విద్య కోసం వెచ్చించిన లక్షల రూపాయలకు ప్రయోజనం లేకుండా పోయింది. 2009 సంవత్సరంలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో కంప్యూటర్ విద్యను ప్రారంభించగా, వీటి ద్వారా మండలంలోని పెద్దజట్రం, బిజ్వార్, పులిమామిడి, చిన్నపొర్ల, ఊట్కూర్ బాలుర ఉన్నత పాఠశాల, బాలికల ఉన్నత పాఠశాలలకు పది నుంచి పదిహేను కంప్యూటర్లతో పాటు దానికి కావల్సిన ఫర్నీచర్‌ను ఏర్పాటు చేశారు. అలాగే కంప్యూటర్ శిక్షకులను నియమించారు. ఇందు కోసం ప్రతీ పాఠశాలకు రెండు నుంచి మూడు లక్షల రూపాయలు ఖర్చు చేశారు. కంప్యూటర్ నేర్పించే శిక్షకులను ప్రైవేటు ఏజెన్సీల ద్వారా నియమించి, కంప్యూటర్ విద్యను నేర్పించడం ప్రారంభించారు. 2009 నుంచి 2014 వరకు నిరంతరం పాఠశాలల్లో విద్యార్థులకు కంప్యూటర్ శిక్షణ అందించారు. ఆరో తరగతి నుంచి పదో తరగతి చదివే విద్యార్థులు సైతం మారుతున్న కాలానికి అనుగుణంగా కంప్యూటర్ విద్యపై ఆసక్తి పెంచుకున్నారు. కంప్యూటర్ నేర్చుకోవడంలో ఉత్సాహం చూపుతున్న తరుణంలోనే కొత్తగా తెలంగాణ ప్రభుత్వం రావడంతో శిక్షకుల నియామకం జరగక కంప్యూటర్ శిక్షణ మధ్యలోనే నిలిచిపోయింది. దీంతో దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించాలి అన్న చందంగా పరిస్థితి మారిపోయింది. గత తొమ్మిది సంవత్సరాలుగా శిక్షకులు లేక కంప్యూటర్లు దుమ్ము పట్టి పోయి మూలకు పడ్డాయి. ఉపాధ్యాయులకే శిక్షణ ఇచ్చి నేర్పిస్తామని అధికారులు పేర్కొంటున్నా, ఉపాధ్యాయులు మాత్రం అది అదనపు భారం అవుతోందని అంటున్నారు. పాత పద్ధతి మాదిరిగానే కంప్యూటర్ శిక్షకులను నియమించి వారు పేర్కొంటున్నారు. మరో పక్క విద్యార్థుల తల్లిదండ్రులు అధికారుల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఒక పక్క డిజిటల్ తరగతుల బోధన చేస్తూ కంప్యూటర్ నేర్పించే శిక్షకులను నియమించక పోతే ఎలా? అని ప్రశ్నిస్తున్నారు. వెంటనే శిక్షకులను నియమించి విద్యార్థులకు కంప్యూట ర్ విద్యను అందేలా చూడాలని కోరుతున్నారు.

శిక్షకులను నియమించాలి..



ఎన్ని కంప్యూటర్లు ఉన్న శిక్షకులు లేకపోతే ప్రయోజనం లేదు. ప్రస్తుతం పాఠశాలలోని కంప్యూటర్ గదికి తాళం వేసి ఉంచాం. మూడు సంవత్సరాలు కంప్యూటర్ నేర్పించాం. తర్వాత నిలిచిపోయింది. మళ్లీ శిక్షకులను నియమించాలి.

- స్పందన, డీటీఎఫ్ జిల్లా నాయకురాలు

ఉపాధ్యాయులకు బాధ్యతలు ఇస్తే అదనపు భారం..



శిక్షకులను నియమించకుండా పాఠశాల నుంచి ఒక ఉపాధ్యాయుడికి శిక్షణ ఇచ్చి బాధ్యతలు ఇస్తే అది అదనపు భారం అవుతోంది. తన సబ్జెక్టును చెప్పడంతో పాటు కంప్యూటర్ నేర్పించడం సాధ్యం కాదు. అందుకే ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చే వారు అవసరం.

- ఆనంద్, పీఆర్టీయూ మండల నాయకుడు

అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం



మాతృభాషా దినోత్సవంలో పాల్గొన్న సాహిత్య పరిషత్ నాయకులు

నారాయణపేట, ఫిబ్రవరి 21: జాతీయ సాహిత్య పరిషత్ భావ సమైక్య వేదిక నారాయణపేట వారి ఆధ్వర్యంలో బుధవారం అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా కవులు పాల్గొని తమ కవితలను వివరించారు. అనంతరం కవులను సన్మానించారు. కార్యక్రమంలో జాతీయ సాహిత్య పరిషత్ భావ సమైక్య వేదిక సభ్యులు, కవులు పాల్గొన్నారు.

సీసీ వేశారు.. క్యూరింగ్ మరిచారు



భూనీడు గ్రామంలో క్యూరింగ్ చేయకుండా వదిలేసిన సీసీ రోడ్డు

కొత్తపల్లి, ఫిబ్రవరి 21 : మండలంలోని వివిధ గ్రామాల్లో అభివృద్ధి పనులల్లో భాగంగా వారం రోజులుగా సీసీ రోడ్డు పనులు జోరుగా కొనసాగుతున్నాయి. కానీ క్యూరింగ్ మాత్రం చేయడం లేదని కాలనీ వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో వేసిన రోడ్లు క్యూరింగ్ చేయకపోవడంతో పూర్తిగా గుంతల మయంగా మారాయని, ఇప్పటికైనా అధికారులు స్పందించి నాణ్యతగా రోడ్డు వేసి, సమాయనికి క్యూరింగ్ చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.

ఘనంగా ఎల్లమ్మ బండారు ఉత్సవం



ప్రత్యేక పూజలు చేసిన కుర్వ యాదవులు

మరికల్, ఫిబ్రవరి 21 : మండలంలోని తీలేరు గ్రామంలోని ఎల్లమ్మ ఆలయ వారణలో మాదారి కుర్వ కులస్థులు బుధవారం రేణుక ఎల్లమ్మ బండారు ఉత్సవాలను అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఎల్లమ్మ దేవత పట్టం వేసి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బంధువులు పసుపు (బండారు) చల్లి, నూతన వస్త్రాలు అందజేశారు. ఈ సందర్భంగా కుర్వ యాదవులు మాట్లాడుతూ ఐదు సంవత్సరాలకు ఒకసారి వచ్చే ఎల్లమ్మ, బీరప్ప బండారు ఉత్సవాలు ఘనంగా జరుపుకోవడం ఆనవాయితీ అన్నారు. మా వృతి గొర్రెలు, వ్యవసాయం, కుటుంబ సభ్యులు చల్లగా ఉండాలని స్వామి వారికి మొక్కులు చెల్లించుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రేవతమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు సునీత, వివిధ గ్రామాల కుర్వ యాదవులు తదితరులు పాల్గొన్నారు.

నేడు రైతు బజార్ ప్రారంభం

ధన్వాడ, ఫిబ్రవరి 21 : మండల కేంద్రమైన ధన్వాడలో గురువారం రైతు బజార్ ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి హాజరవుతున్నట్లు కాంగ్రెస్ నాయకులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత ఎమ్మెల్యే ఎస్ రాజేందర్‌రెడ్డి హయంలో రూ.22 లక్షల వ్యయంతో రైతు బజార్‌ను నిర్మించారు. నిర్మాణం పూర్తై నెల రోజుల కావస్తుండటంతో ప్రారంభానికి ఏర్పాట్లు పూర్తి చేశారు.

జోరుగా ధాన్యం విక్రయాలు

నారాయణపేట, ఫిబ్రవరి 21 : నారాయణపేట వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం ధాన్యం విక్రయాలు జోరుగా కొనసాగాయి. వేరు శనగలు 314 క్వింటాళ్లు విక్రయానికి రాగా, క్వింటాలుకు ధర గరిష్ఠంగా రూ.7,102, కనిష్ఠంగా రూ.4,522, రమారమిగా రూ.6,449 పలికింది. జొన్నలు 35 క్వింటాళ్లు రాగా, క్వింటాలుకు ధర గరిష్ఠంగా రూ.4,761, కనిష్ఠంగా రూ.3,929, రమారమిగా రూ.4,470, పెసర్లు ఎనిమిది క్వింటాళ్లు రాగా, క్వింటాలుకు ధర గరిష్ఠ, కనిష్ఠంగా రూ.8,861, అలసందలు 34 క్వింటాళ్లు రాగా, క్వింటాలుకు ధర గరిష్ఠంగా రూ.8,139, కనిష్ఠంగా రూ.7,806, రమారమిగా రూ.8,139, తెల్ల కందులు 26 క్వింటాళ్లు రాగా, క్వింటాలుకు ధర గరిష్ఠంగా రూ.10,909, కనిష్ఠంగా రూ.10,680, రమారమి ధర రూ.10,909, ఎర్ర కందులు 59 క్వింటాళ్లు రాగా, క్వింటాలుకు గరిష్ఠంగా రూ.10,629, కనిష్ఠంగా రూ.10,189, రమారమిగా రూ.10,579 పలికింది.

జర్నలిస్టులపై దాడిని ఖండించిన టీడీపీ

నారాయణపేట టౌన్, ఫిబ్రవరి 21 : ఆంధ్రప్రదేశ్‌లో జగన్ మోహన్‌రెడ్డి అరాచక ప్రభుత్వంలో అవినీతి బాగోతాన్ని బయటకు తీస్తున్న జర్నలిస్టులపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు టీడీపీ అడ్‌హక్ కమిటీ సభ్యుడు రాఘువరావు చౌద్రి, ప్రసాద్, మనోహర్ చౌద్రి, రామకృష్ణ బుధవారం ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. జర్నలిస్టులే కాదు యావత్ తెలుగు ప్రజలకు మా పార్టీ అండగా నిలబడుతుందని, రాబోయే ఎన్నికల్లో టీడీపీ పార్టీ సునామి అని ఆ సునామీలో జగన్ కాలగర్భంలో కలవక తప్పదని హెచ్చరించారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



సీసీ రోడ్డు పనులను ప్రారంభించిన కాంగ్రెస్ నాయకులు

దామరగిద్ద, ఫిబ్రవరి 21 : మండలంలోని పిడెంపల్లి గ్రామంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద సీసీ రోడ్డు పనులను కాంగ్రెస్ మండల నాయకుడు రాఘవేందర్ బుధవారం టెంకాయ కొట్టి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పది సంవత్సరాలుగా నారాయణపేట జిల్లా అభివృద్ధికి నోచుకోలేదని, ఇక నుంచి కాంగ్రెస్ ప్రజాపాలనలో గ్రామాల అభివృద్ధికి పెద్దపీట వేస్తోందన్నారు. పార్టీలకు అతీతంగా గ్రామాభివృద్ధిలో అందరు కలిసి రావాలన్నారు.

జల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడికి సన్మానం



అనంత్‌రెడ్డిని సన్మానిస్తున్న బీకేఎస్ నాయకులు

నారాయణపేట, ఫిబ్రవరి 21 : జల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు అనంత్‌రెడ్డిని బీకేఎస్ జోనల్ కార్యదర్శి వెంకోబా ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా రైతులకు సాగు నీరందించే జీవో 69 పేట - కొడంగల్ ఎత్తిపోతల పథకం చేపట్టాలని అఖిల పక్ష నాయకులను ఒక్కటిగా చేసి, మహా పాదయాత్ర చేయడం అభినందనీయం అన్నారు. అనంత్‌రెడ్డి మాట్లాడుతూ పేట - కొడంగల్ ఎత్తిపోతల పథకం కోసం పోరాటం చేసిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అఖిల పక్షం నాయకులు వెంకట్రామ్‌రెడ్డి, రఘువీర్, రాములు, నరసింహా, రంగారెడ్డి పాల్గొన్నారు.

కుల గణన తీర్మానం హర్షణీయం

మక్తల్, ఫిబ్రవరి 21 : కుల గణన తీర్మానాన్ని తెలంగాణ అసెంబ్లీ ఏకగ్రీవంగా ఆమోదించడం చారిత్రాత్మక నిర్ణయం అని బీసీ ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్ అన్నారు. బుధవారం ఆయన పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీసీ సామాజిక స్థితిగతులు, ఆర్థిక పరిస్థితులు తెలుసుకోవచ్చు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలు బీసీల రిజర్వేషన్లు పెంచినప్పుడల్లా బీసీ జనాభా లెక్కలు లేనందున రిజర్వేషన్లు కొట్టివేస్తున్నాయన్నారు. కుల గణన వల్ల స్థానిక సంస్థలు, చట్ట సభల్లో బీసీల వాటా తెలుస్తుందన్నారు. విద్య, ఉద్యోగ అవకాశాల్లో కుల గణన ఉపయోగపడుతుందన్నారు. కుల గణనకు ఆమోదం తెలిపిన బీసీ మంత్రి పొన్నం ప్రభాకర్, సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి వారు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీసీ ఐక్యవేదిక అధ్యక్షుడు అశోక్‌గౌడ్, మండల కార్యదర్శి రవికుమార్, నాయకులు చిట్యాల ఆంజనేయులు, వెంకటప్ప పాల్గొన్నారు.

నేడు పర్వనాథ్ భగవాన్ విగ్రహం ప్రాణ ప్రతిష్ఠాపన

కృష్ణ, ఫిబ్రవరి 21 : మండలంలోని కున్సీ గ్రామ శివారులో వెలసిన శ్రీ మనమోహన్ పర్వనాథ్ మందిరంలో గురువారం పర్వనాథ్ భగవాన్ విగ్రహం ప్రాణ ప్రాతిష్ఠాపన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు షార్ని కుమార్ డోకా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జైన మందిరంలో నూతనంగా నిర్మాణం చేసిన ఆలయం, పర్వనాథ్ భగవాన్ విగ్రహం ప్రాణ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి హాజరవుతారని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.